# కర్నూలు | నంద్యాల వార్త

13 మే 2026 బుధవారం పేజీలు 4


# జిల్లా అభివృద్ధిపై..చర్చ

**మంత్రి టీజీ భరత్ ఇంట్లో సమావేశమైన ఎంపీ, ఎమ్మెల్యేలు , ఇంచార్జీలు ..**

**కర్నూల్ హాస్పిటల్ మే 12 ప్రభాతవార్త :** కర్నూలులో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా ఇంట్లో తెలుగుదేశం పార్టీ కర్నూలు జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు సమావేశం అయ్యారు. జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ఎంపీ బస్తీపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ శ్యాం బాబు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.వి జయనాగేశ్వర రెడ్డి, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆదోని ఇంచార్జి మీనాక్షి నాయుడు, ఆలూరు ఇంచార్జి వైకుంఠం జ్యోతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో పార్టీ నాయకుల మధ్య సమన్వయం దెబ్బతినకుండా నెలలో ఒకసారి ఎంపీ, ఎమ్మెల్యే, ఇంచార్జి ఇంట్లో అంతా సమావేశమై భోజనం చేసే కొత్త సంప్రదాయానికి పార్టీ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంత్రి టీజీ భరత్ గుప్తా ఇంట్లో వీరు మధ్యాహ్నం భోజనం చేశారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై వీరంతా చర్చించారు.



# ప్రజలకు పనిచేయని.. తహశీల్దార్ మాకొద్దు..!

- ప్రజలకు అందుబాటులోని ఎంఆర్‌వోను బదిలీ చేయాలి..
- తహశీల్దార్ కార్యాలయం ముందు భారీ ధర్నా..దద్దరిల్లిన తహశీల్దార్ ప్రాంగణం..
- నిరసన వ్యక్తం చేసిన టీడీపి నాయకులు..కార్యాలయం ముందు వంటావార్పు..

**కోసిగి, మే 12, ప్రభాతవార్త :** మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండక సమస్యలను నాన్చుతూ పనిచేయని తహశీల్దార్ మా మండలానికి వద్దు అంటూ కోసిగి మండల టీడీపి ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తూన భారీ ధర్నాను నిర్వహించి వంటావార్పు చేపట్టారు..మంగళవారం కోసిగిలోని తిక్కారెడ్డి వర్గీయులు తహశీల్దార్ వద్దంటూ బైక్ ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ ప్రజలకు పనిచేయని ఎంఆర్‌వోను బదిలీ చేయాలంటూ బైటాయించారు.. తెలుగు వాణిజ్యవిభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరత్వాజా శెట్టి, తెలుగు యువత అధ్యక్షులు నాడిగేని మహాదేవ, బిసి.సెల్ జిల్లా కార్యదర్శి కొండగేని వీరారెడ్డి, బీసీ సీనియర్ నాయకులు నాడిగేని తాయన్న, పంపాపతిల ఆధ ర్వర్యంలో స్థానిక తేరుబజారు నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు.. అనంతరం కోసిగి తహశీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, అలాగే ఈయనకు ఒత్తసు పలుకుతున్న విఆర్‌వోలను కూడా విదుల నుండి తప్పించి సస్పెండ్ చేయాలని నినాదాలతో తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణం దద్దరిల్లింది.. వారు మాట్లాడుతూ తహశీల్దార్ ప్రతి పనికి డబ్బులు వసూలు చేస్తూ కార్యాలయానికి మధ్యాహ్నం వస్తూ కాలయాపన చేస్తున్న కోసిగి తహశీల్దార్ వేణుగోపాల్ మాకు వద్దన్నారు.. ముఖ్యంగా పైసలు ఇస్తేనే పనుల చేస్తున్నాడని, ఇటీవల దళితులకు ఆర్డీటి సంస్థ ఇళ్లు కట్టేందుకు ముందుకు రాగా లబ్దిదారులైన ఎస్సీలకు ఇళ్ల పొజిషన్ పట్టాలు అడిగితే విఆర్‌వోల మధ్య వర్తిత్వంతో డబ్బులు డిమాండ్ చేసాదన్నారు.. అంతేకాక దళితులు డబ్బులు తమ వద్ద లేవని వారు ఇవ్వక పోతే వారిపై తీవ్రగం ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిని తూలనాడి పట్టాల పొజిషన్ ఇవ్వకుండా వేధించడం జరిగిందనా న్నరు..ప్రజల కోసం పనిచేయని ఈలాంటి ఎంఆర్‌వో తమ మండలానికి అవసరం లేదని ఇతనిని వెంటనే బదిలి చేసి పనిచేసే తహశీల్దార్‌ను నియమించాలని డిమాండ్ చేసారు..అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుటే వంటా వార్పు చేసి అందరికి భోజనాలు వడ్డించి నిరసన తెలిపారు.. ప్రజలకు పనిచేయని తహశీల్దార్‌ను బదిలీ చేయాలని లేనిచో సస్పెండ్ చేయాలని, ఒకవేళ ఇది జరగక పోతే జిల్లాస్థాయిలో కూడా తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు..అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐ శ్రీరాములకు అందించారు.. ఈ కార్యక్రమంలో నాడుగేని వీరారెడ్డి, ఉమర్‌సాబ్, డీలర్ నరసన్న, శీను, ఎంపిటిసి బి.రాజు, చిన్నభూంపల్లి నరసింహులు, అర్లబండ రామాంజినేయులు, చింతకుంట అంపయ్య, సాతునూరు ఉలిగయ్య, బెళగల్ ప్రభాకర్‌రెడ్డి, సూర్యకాంతరెడ్డి, మాల రామయ్య, బసవలింగప్ప, ఉసేని, రాజశేఖర్‌రెడ్డి, నేలకోసిగి మహాదేవ, మూగలదొడ్డి శ్రీను, కామనదొడ్డి ఈరన్న, వెంకటరెడ్డి, హనుమంతు, దాదా ఉసేని, మారెష్, ఆయా గ్రామాల కార్యకర్తలు, తదితరులు పాల్గొనా న్నరు..





# జలహారతితో.. సాగునీరు..!

- జిల్లాలో 4,100 పనుల గుర్తింపు..
- 2,100 మంజూరు.. 1,100 పనులు గ్రౌండింగ్ పూర్తి
- సోమయాజులపల్లె చెరువులో పూడికతీత పనుల్లో కలెక్టర్



**కర్నూలు, మే 12, ప్రభాతవార్త :** జిల్లాలో"జలధార-జలహారతి" కార్యక్రమం ద్వారా భూగర్భ జలాల స్థాయిని పెంచి, చెరువుల అనుసంధానం ద్వారా రైతులకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామంలో జలధార-జలహారతి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన చెరువు పూడికతీత పనులను ప్రారంభించి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు అధిక సంఖ్యలో ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించాలని కలెక్టర్ డ్వామా అధికారులను ఆదేశించారు. చెక్‌డ్యామ్ మరమ్మతులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి పనులను త్వరితగతిన అమలు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా జలహారతి కింద మొత్తం 4,100 పనులను గుర్తించగా, అందులో 2,100 పనులకు మంజూరు లభించిందని, ఇప్పటికే 1,100 పనులు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి భూగర్భ జలాల పెంపు, చెరువుల నింపుదల, సాగునీటి విస్తరణ లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. సోమయాజులపల్లె చెరువు సుమారు 8.5 ఎఫ్‌టీఎం నీటి సామర్థ్యంతో ఉండగా, కొమరోలు ప్రాంతం నుంచి వచ్చే ఫీల్డ్ వాటర్‌ను రాజుకత్వ కాలువ ద్వారా చెరువులోకి మళ్లించే ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. చెరువులో నిల్వైన అదనపు నీటిని కొమ్మచెరువుకు, అక్కడి నుంచి నంద్యాల జిల్లా మంచాలకట్ట చెరువుకు తరలించే విధంగా చెరువుల అనుసంధానం చేపడుతు న్నామని వివరించారు. ఈ విధానం ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా నిల్వై భూగర్భ జలాల పెంపుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ చెరువు పూడికతీత పనుల కోసం సుమారు రూ.9.60 లక్షల లేబర్ కాంపోనెంట్ బడ్జెట్ కేటాయించగా, 3,000 పనిదినాలు సృష్టిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి చెరువును పునరుద్ధరించి, ఫీడర్ చానళ్లను అభివృద్ధి చేసి, వర్షపు నీటిని సమర్థంగా నిల్వచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ఆర్డీఓ అనురాధ, డ్వామా పిడి నరసింహ రెడ్డి, ఏపిడి పద్మ, ఓర్వకల్లు తహశీల్దార్ విద్యాసాగర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులలో అవినీతి.. పట్టించుకోని అధికారులు



**పత్తికొండ, మే 12, ప్రభాతవార్త:** మండలంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులలో అవినీతి జరుగుతున్న సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అధికారులే దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పై అధికారుల ప్రోత్సాహంతోనే ఈ అవినీతి జరుగుతుందని ప్రజలు, కర్షకులు చర్చించుకుంటున్నారు. దీంతో నిజమైన కూలీలకు మోసాలు జరుగుతున్నప్పటికి కూడా పర్యవేక్షించాల్సిన అధికారులకు వాటా ఉండడం వలనే వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిసింది. ఉపాధి హామీ పథకంలో దాదాపు 26 రకాల పనులు ఉన్నప్పటికి కొన్ని పనులు మాత్రం కల్పిస్తున్నార, మిగిలిన పనులు చూపెట్టడం లేదని, దివ్యాంగులకు కూడా ఉపాధి కూలీలు సంభంధించిన పనులను చూపకపోవడంతో అదికారుల నిర్లక్ష్యం ఎంతో ఉందో అర్థం అవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. కష్టపడి పని చేసే కూలీలకు వేతనంలో కోత, చేయని వారికి పూర్తి వేతనం ఇస్తూ అవినీతికి పాల్పడుతున్నారని, పనికి రాని కూలీలకు సైతం వారి ఖాతాలలో డబ్బు జమచేసి పర్సెంటేజీలు తీసుకుంటు అవినీతికి పాల్పడుతున్నారని భాహటంగా చర్చ జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనె చర్చ జరుగుతుంది.

# డిజిటల్ డోర్ నెంబర్లతో.. విప్లవాత్మక మార్పు

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు మున్సిపల్, మే12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన క్యూఆర్ కోడ్ అధారిత డిజిటల్ డోర్ నంబర్ల ద్వారా పౌర సేవల్లో విప్లవాత్మక మార్పువస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నోడల్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్లు, అడ్మిన్ ప్లానింగ్ అమినిటీస్ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డిజిటల్ డోర్ నంబర్ల ద్వారా ప్రతి ఇంటికి ప్రత్యేక క్యూఆర్ కోడ్ అనుసంధాన మవుతుందని దీని ద్వారా ఆస్తి వివరాలు, పన్ను చెల్లింపులు, నీటి సరఫరా ట్రేడ్ లైసెన్సు పౌర సేవలకు సంబంధించిన అన్ని వివరాలు ఒకే వ్యవస్థలో అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈవ్యవస్థ ద్వారా పౌరసేవలు మరింత వేగవంతంగా పారదర్శకంగా ప్రజల ముంగిటికే చేరుతా యన్నారు. దీనికోసం నియమించిన నోడల్



అఫీసర్లు, మాస్టర్ ట్రైనర్లు సమర్థవంతంగా పనిచేసి అడ్మిన్, ప్లానింగ్ అమినిటీస్ కార్యదర్శులతో సమన్వయంతో ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఇంచార్జీ సిటి ప్లానర్ వైవి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.

# హరిత మంత్రాలయంగా.. తీర్చిదిద్దుతాం

**: రూ. 15 లక్షల విరాళంతో ముందుకు వచ్చిన దాత పీవీ బద్రీనాథ్ రావు..**
**: మొక్కలకు నీటి సరఫరా పనులను ప్రారంభించిన శ్రీమఠం పీఠాధిపతి**




**మంత్రాలయం టౌన్ ,మే 12 ప్రభాతవార్త :** దక్షిణ భారత దేశంలో రెండో తిరుపతిగా విరాజిల్లుతున్న మంత్రాలయం పుణ్యక్షేత్రాన్ని పచ్చదనంతో కళకళలాడే హరిత మంత్రాలయంగా తీర్చిదిద్దుతామని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుబుధేంద్ర తీర్థులు స్వామీజీ ఉద్ఘాటించారు. మంగళవారం మంత్రాలయంలోని డీవీజీ అతిథి గృహం సమీపంలో హైవే రోడ్డు డివైడర్ల మధ్య ఉన్న మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు.పాణ్యంకు చెందిన ఉజ్వల వేద బృందావన్ అధినేత, ప్రముఖ దాత పీవీ బద్రీనాథ్ రావు సుమారు రూ. 15 లక్షల వ్యయంతో మంత్రాలయంలోని మొక్కల సంరక్షణ బాధ్యతను చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు శ్రీమఠం అతిథి గృహాలు, తులసి వనం, గోశాల, బృందావన గార్డెన్, సుశమీంద్రతీర్థుల పార్క్, గురు నివాస్ ప్రాంతాల్లో మొక్కలు నాటడం, వాటిని క్రమం తప్పకుండా పెంచే బాధ్యతను తమ సంస్థ తరపున నిర్వహిస్తామని దాత తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ సుబుధేంద్ర తీర్థులు మాట్లాడుతూ ,మంత్రాలయానికి వచ్చే భక్తులకు, స్థానిక గ్రామస్తులకు ఆహ్లాదకరమైన, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే మా లక్ష్యం. రాబోయే మూడు నెలల్లో మంత్రాలయం అంతా పచ్చదనం సంతరించుకుంటుంది. పర్యావరణ పరిరక్షణ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చిన పీవీ బద్రీనాథ్ రావు అభినందనీయులున్నారు. అనంతరం దాత బద్రీనాథ్ రావును స్వామీజీ శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీమఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్.కె. శ్రీనివాసరావు, సురేష్ కోణాపూర్, వెంకటేష్ జోషి, సుకుమార్, కెనరా బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు, ఎంఈవో రాఘన్న, తదితర అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగణన ప్రక్రియ వేగవంతం చేయాలి

**: తప్పులు లేకుండా అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశం**

**కర్నూలు, మే 12, ప్రభాతవార్త :** జనగణన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామంలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ నిర్వహిస్తున్న జనగణన ప్రక్రియను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వడ్డే సుబ్బమ్మ నివాసంలో ఎన్యూమరేటర్ డిజిటల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో పని చేయాలని సూచించారు. యాప్ వినియోగంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయా అని తెలుసుకుని, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జనగణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించి సరైన సమాచారం ఇవ్వాలని కలెక్టర్ కోరారు. జనగణన ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కోల్పోరని, వ్యక్తిగత వివరాలు దుర్వినియోగం కావని ప్రజలకు స్పష్టం చేశారు. వడ్డే సుబ్బమ్మ ఇంటి వ్యక్తిగత గృహ మరుగుదొడ్డి దెబ్బతిన్న విషయం తెలుసుకున్న కలెక్టర్, వెంటనే మరమ్మతులు చేపట్టేలా ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమెతో మాట్లాడి పెన్షన్, రేషన్ సరఫరా వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఆర్డీఓ అనురాధ, ఓర్వకల్లు తహశీల్దార్ విద్యాసాగర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**మంత్రాలయం, మే 12, ప్రభాతవార్త;** మండల పరిధిలోని చెట్నహళ్లి గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ ఆంజనేయస్వామిని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షులు గుర్రెడ్డి భీంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గంగుల వెంకటేష్, అల్లింగప్ప, నాగేంద్ర, ఉప సర్పంచ్ వీరనాగప్ప తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా.. శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు

**- శ్రీ గిడ్డాంజినేయ స్వామిని దర్శించుకున్న డోన్ శాసన సభ్యులు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి**

**కోడుమూరు,మే 12,ప్రభాతవార్త:** కోడుమూరు మండలంలోని ఆయా గ్రామాలల్లో మంగళ వారం శ్రీశ్రీశ్రీ హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా గ్రామాలల్లో వెలసిన శ్రీ ఆంజినేయ స్వామి సన్నిధిల్లో భక్తులు ప్రత్యేక పూజలు గావించారు. మండలంలోని వెంకటగిరి గ్రామంలో జరిగే ఉత్సవ కార్యక్రమాలకు కోట్ల కుటుంబ సభ్యులంతా వేరు వేరుగా వచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా మాజీ కేంద్ర మంత్రి డోన్ శాసన సభ్యులు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, సోదరులు సీనియర్ రాజకీయ నాయకులు కోట్ల హరి చక్రపాణిరెడ్డి,రాష్ట్ర వైసీపీ నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిలు స్వామి జయంతోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే ఉత్సవాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు,అన్నదాన వితరణలు కార్యక్రమాలతో అన్ని చోట్ల ఎంతో అలరించాయి. అదే విధంగా సాయంత్రం వేలల్లో శ్రీ హనుమాన్ భక్త బృందం వారంతా శోభాయాత్రలను పట్టణ పురవీధుల గుండా నిర్వహించారు. ఈ యాత్రలల్లో భక్తుల బృందం అంతా జై .. శ్రీరామ్ .. జై ..జై వీరాంజినేయ అంటూ పెద్దపెట్టున భక్తి పాటలతో చిందులు వేశారు. ఈ వేడుకల్లో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన నేతలు, నాయకులు, ఉత్సవాలల్లో పాల్గొని ఉత్సవ కార్యక్రమాలను తిలకించారు.



**వైభవంగా వెంకటగిరి శ్రీ గిడ్డాంజినేయ స్వామి రథోత్సవ వేడుకలు :** కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలో ప్రతిష్ట గాంచిన శ్రీ గిడ్డాంజినేయ స్వామి వేడుకలు ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్సవ కార్యక్రమాలు ఎంతో వైభవంగా సాగాయి. ఈ ఉత్సవ కార్యక్రమాలల్లో భాగంగా సాయంత్రం సాగిన శ్రీ గిడ్డాంజినేయ స్వామి రథోత్సవ వేడుకలు అంగ రంగ వైభవంగా సాగాయి.

# యాగంటి ఆలయ సమీపంలో ఆటో బోల్తా.. మహిళ దుర్మరణం..

**: ముగ్గురికి గాయాలు.. దర్శనం ముగించుకుని వస్తుండగా విషాదం**

2లో



# శ్రీమఠం హుండీ ఆదాయం రూ. 2.78 కోట్లు

**మంత్రాలయం టౌన్, మే 12 ప్రభాతవార్త,:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి వారి మఠంలో భక్తులు సమర్పించుకున్న హుండీ కానుకల లెక్కింపు మంగళవారం (మే 12, 2026) నిర్వహించారు. ఏప్రిల్ మరియు మే నెలకు సంబంధించి గత 20 రోజులలో (ఏప్రిల్ 22 నుండి మే 11 వరకు) భక్తులు మొక్కుబడిగా చెల్లించిన నగదు, బంగారం మరియు వెండిని శ్రీమఠం అధికారులు లెక్కించారు. లెక్కింపు అనంతరం మేనేజర్ వెల్లడించిన వివరాల ప్రకారం...కరెన్సీ (నోట్లు) రూ. 2,69,28,176 చిల్లర నాణేలు రూ. 8,91,350 మొత్తం నగదు రూ. 2,78,19,526 ఉన్నాయి. కానుకల రూపంలో వచ్చిన ఆభరణాలు బంగారం 15 గ్రాముల 100 మిల్లీగ్రాములు,వెండి 751 గ్రాములు. శ్రీమఠం అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది మరియు భక్తులు ఈ లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు. వేసవి సెలవులు కావడంతో భక్తుల రద్దీ పెరిగి, తద్వారా స్వామివారికి సమర్పించిన కానుకల ఆదాయం కూడా గణనీయంగా వచ్చినట్లు తెలుస్తోంది.



# 8వ వార్డులో ఘనంగా మన నగరం మన బాధ్యత

**కర్నూలు హాస్పిటల్ మే 12 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు కొరకంచి రవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న"మన నగరం మన బాధ్యత కార్యక్రమం 18వ రోజు 8వ వార్డులో ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి టీజీ భరత్ గుప్తా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకోగా ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మరియు 8వ వార్డు ఇంచార్జి కురువ పరమేశ్, యూనిట్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్సార్సీపీ యూత్ నేత ఆత్మహత్యాయత్నం..!

**: పోలీసుల వేధింపులే కారణమని ఆరోపణలు, ఆస్పత్రికి తరలింపు..**



**కర్నూలు అర్బన్, మే 12, ప్రభాతవార్త :** కర్నూలు నగరంలో వైఎస్సార్సీపీ యూత్ సిటీ ప్రెసిడెంట్ బాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై పోలీసులు మరియు ప్రత్యర్థి పార్టీ నేతలు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ కత్తితో చేయి కోసుకున్నారు. సమాచారం మేరకు, గతంలో నమోదైన సారా కేసులో అరెస్టైన బాలు ప్రస్తుతం కోర్టు వాయిదాలకు హాజరవుతూ ఉన్నారు. రెండు రోజుల క్రితం వాయిదా నిమిత్తం హైదరాబాద్ నుంచి కర్నూలుకు వచ్చినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు ఆయనను స్టేషన్‌కు రావాలని కోరుతూ, సీఐ పిలుస్తున్నారని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్రమనస్తాపానికి గురైన బాలు తన చేతిని కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం తాను మాట్లాడుతూ వైఎస్సార్సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తుండటంతో అధికార పార్టీ నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నా రని ఆరోపించారు. అక్రమ కేసులు పెట్టి, రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు వేధిస్తున్నారని తెలిపారు. తన కారును కూడా సీజ్ చేశారని, నిరంతరం మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తన తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో ఇలాంటి వేధింపులు తట్టుకోలేక పోతున్నానని కన్నీటి పర్యంత మయ్యారు. తనకు ఏమైనా జరిగితే దానికి పోలీసులే పూర్తి బాధ్యత వహించాలని వీడియోలో పేర్కొన్నారు. ఘటన సమాచారం అందుకున్న వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అక్కడికి చేరుకొని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. “ఏ ఆధారాలతో అరెస్టు చేస్తారు..? నోటీసు ఇచ్చారా..?” అరెస్ట్ వారెంట్ ఉందా అంటూ పోలీసులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు, వైఎస్సార్సీపీ నేతలకు మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. గాయపడిన బాలును వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా ప్రారంభమైన సమ్మర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్

**నంద్యాల మున్సిపాల్టి, మే 12, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా యువతను క్రీడల వైపు ప్రోత్సహించలనే ఉదేద్యంతో నిర్వహించిన పిడతల సుదాకరు సమ్మర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటుపోటీలను యన్‌యండి పియాజ్ లాంచనంగా ప్రారంబించారు. ఈసందర్భముగా యన్‌యండి ఫయాజ్ మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని అయన చెప్పారు.

## వడ్డే రాజు వర్ధన్ అనే యువకుడు పై దాడి



**డోన్, మే 12, ప్రభాతవార్త :** డోన్ మండల పరిధిలోని కొచ్చేరు గ్రామానికి చెందిన వడ్డే రాజ వర్ధన్ అనే యువకుడు పై కొచ్చేరు గ్రామానికి చెందిన కురవ సామాజిక వర్గం చెందిన మధు చరణ్ జెసి ముగ్గురు కలిసి యువకుడు పై విచక్షణ రహితంగా దాడి తీసి గాయపరిచారని బాధితుడు మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు

## ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు..

**: ప్రజలను ఆకర్షిస్తున్న చెక్కభజన కార్యక్రమం..**



**డోన్, మే 12, ప్రభాతవార్త :** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని తారక రామ నగర్ లో మంగళవారం ఉదయం 6 గంటలకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి అభయ అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు తారక రామ్ నగర్ లో ఉన్నటువంటి అభయ ఆంజనేయ స్వామి ప్రతి సంవత్సరం దిన దిన అభివృద్ధి గా చెందుతుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు ప్రతి సంవత్సరం హనుమాన్ జయంతిని తారకరామ్ నగర్ లో ఉన్నటువంటి నాయకులు ఐకమత్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు అందులో భాగంగానే వచ్చిన భక్తులకు తారక రామ్ నగర్ లో ఉన్నటువంటి ప్రతి ఇంటి కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు అభయ ఆంజనేయ స్వామి దర్శించుకుని కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం ప్రజలను ఆకర్షించడానికి వెంకట్ నాని పల్లె చెక్కభజన కుశలన్న బృందం చేత చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు చిన్నారుల చేత వివిధ భక్తి పాటలతో ఆరాధించి ప్రజలను ఆకర్షించారు హనుమాన్ జయంతి సందర్బంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ ఇంతియాజ్ భాష ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు గ్రామోత్సవంలో ఎటువంటి చిన్న సమస్య రాకుండా పెద్దలు ఆంజనేయ గౌడ్ నాగేశ్వర గౌడ్ పాలరాజు వడ్డే వెంకటేశ్వర్లు వడ్డే గెల్పాల రాముడు చాకలి వెంకటేశ్వర్లు ఎద్దు పెంట రంగయ్య ఎందుకంటే వెంకటేశ్వర్లు ఎం లక్ష్మయ్య వడ్డే సెంట్రింగ్ నరసింహ వడ్డే బోగోలు సుంకన్న వడ్డే లక్ష్మన్న ఈడిగ సురేష్ గౌడ్ ఉమాపతి పుల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## యువకుడు ఉరివేసుకొని మృతి



**డోన్, మే 12, ప్రభాతవార్త :** డోన్ పట్టణంలోని కొండపేట చెందిన బోయ మధు కుమారుడు బోయ మహేష్ అనే యువకుడు ఇంట్లో ఎవరు లేని సమయంలో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఉరివేసుకొని మృతి చెందినట్లు మృతుని తండ్రి మధు పోలీసులకు తెలియజేశారు వివరాలకు వెళితే బోయ మహేష్ బుల్లెట్ బండి కొనివ్వలేదని మనస్థాపన గురై మృతి చెందాడని పోలీసులకు తెలిపారు వారి సమాచారం మేరకు అర్బన్ సీఐ ఇంతియాజ్ భాష సంఘటన స్థలానికి వెళ్లి మృతి దేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు అర్బన్ సీఐ తెలిపారు

## ట్యాంకర్లతో నీటి సరఫరా..



**ఎమ్మిగనూరు టౌన్, మే 12, ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణంలోని 5వ వార్డు శివన్ననగర్ యల్లమ్మ గుడి వెనుక ప్రాంతంలో గత రెండు రోజులుగా నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి పరిష్కరించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేయించి ప్రాంత ప్రజలకు ఊరట కల్పించారు. గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించడంతో శివన్ననగర్ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వర రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, వార్డు ఇంచార్జ్ రంగస్వామి గౌడ్, వార్డు ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలి

**ఎమ్మిగనూరు టౌన్, మే 12, ప్రభాతవార్త:** ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలని, ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేసారు. గుర్తింపు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని కోరారు. ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు గఫూర్ అధ్యక్షతన పట్టణ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. షాబీర్ భాష ముఖ్య అతిథిగా హాజరై ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడిపై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ గురించి వివరించారు. విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తులో ఉన్నారని విమర్శిస్తూ, సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హాజీ, శివ, వీరేష్, చరణ్, మోహన్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.




## కూటమి పెద్దలు ఏకతాటి పై రావాలి




**ఆదోని క్రైమ్, మే 12, ప్రభాతవార్త :** ఆదోని మండలం కుప్పగల్‌లో ఇటీవల బీజేపీ నాయకులు, టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తను మాదిరే సొసైటీ డైరెక్టర్ ముగ్ధాం భాష పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి నాయకత్వంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. “మా కుటుంబం అయినా, నేను నిజాలే మాట్లాడుతా. గ్రామాల్లో జరుగుతున్న గొడవలు చూస్తుంటే ఎక్కడో సమన్వయం లోపిస్తోంది. కూటమి పెద్దలు ముందుగా ఒక్కటిగా ఉండాలి. మీరు కలిసి ఉంటేనే గ్రామాల్లో కార్యకర్తలు సఖ్యతగా ఉంటారు” అని పేర్కొన్నారు. ఆదోని నియోజకవర్గంలో మూడు పార్టీల నాయకులు మూడు విధాలుగా వ్యవహరిస్తున్నారని, అసలు కూటమి పాలన ఉందా లేదా అన్న అనుమానం కలుగుతోందన్నారు. కూటమిలో ఎవరికి నష్టం జరిగినా చివరికి బాధపడేది కార్యకర్తలేనని వ్యాఖ్యానించారు. ఇటీవల గాయపడిన వారిని ఎమ్మెల్యే పార్థసారథి, సీనియర్ టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు పరామర్శించి సఖ్యతగా ఉండాలని సూచించారని, అదే సందేశాన్ని కూటమి పెద్దలే ముందుగా ఆచరించాలని ముగ్ధాం భాష ప్రశ్నించారు. “గ్రామాల్లో ఘర్షణలు జరుగుతున్నాయంటే ఎక్కడో నాయకత్వంలో లోపం ఉంది. భవిష్యత్తులో ఫ్యాక్షన్ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉంది” అని ఒక సీనియర్ జర్నలిస్టుగా తన అనుభవంతో తెలిపారు. టీడీపీకి గ్రామ స్థాయిలో బలమైన క్యాడర్ ఉందని, ఇటీవల వైసీపీ నుంచి బీజేపీలోకి చేరిన వారిని నియంత్రించాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉందన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. “చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ దీర్ఘకాలిక పొత్తుతో ముందుకెళ్తుంటే ఆదోని నియోజకవర్గంలో మాత్రం విభజించి పాలిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది” అని విమర్శించారు. నియోజకవర్గంలోని అధికారులు కూడా రాజకీయ సమన్వయం లేక ఇబ్బందులు పడుతున్నారని, కొందరు బదిలీలు కోరుకుంటున్నారని తెలిపారు. కబ్జాలపై ఫోకస్ తగ్గించి కార్యకర్తల సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదోని నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. చివరిగా టీడీపీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తూ, “ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా కష్టపడుతుంటే ఆదోనిలో కార్యకర్తలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. కూటమి పెద్దలు అందరూ ఒక తాటిపైకి రావాలి. లేదంటే ప్రశాంతమైన ఆదోని నియోజకవర్గానికి ఫ్యాక్షన్ ముద్ర పడే ప్రమాదం ఉంది” అని ముగ్ధాం భాష ఆవేదన వ్యక్తం చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో ఆసరా..



**ఆదోని, మే 12, ప్రభాతవార్త :** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఎంతో ఆసరని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఉమాపతి నాయుడు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఆదోని లో 17 మంది సభ్యులు గాను 399447 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ హాస్పిటల్ లో ఎవరైనా చికిత్స పొంది ఉంటే అలాంటివారు వారి బిల్లులను తెచ్చి పార్టీ కార్యాలయం వస్తే వారికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చే విధంగా చూస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ. పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప. కృష్ణారెడ్డి. మాజీ కౌన్సిలర్ బాలాజీ. మా భాష తదితరులు పాల్గొన్నారు

## పల్నాడు, బాపట్ల జిల్లాల జోనల్ ఇన్చార్జిగా ఎమ్మెల్సీ బీటీ.నాయుడు



**ఆదోని, మే 12, ప్రభతవార్త :** తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. పల్నాడు మరియు బాపట్ల జిల్లాల జోనల్ ఇన్చార్జిగా సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ బీటీ.నాయుడుని నియమిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మరియు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలియజేశారు.. రెండు సార్లు కర్నూలు ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్సీగా, కార్పొరేషన్ చైర్మన్ మరియు ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన అపార అనుభవంతో పాటు, సుప్రీంకోర్టు లాయర్‌గా ఉన్నత స్థాయి నైపుణ్యం కలిగిన బీటీ.నాయుడుకి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు.. బీటీ.నాయుడు మాట్లాడుతూ నాపై నమ్మకంతో పల్నాడు, బాపట్ల జిల్లాల బాధ్యతలు అప్పగించిన నారా చంద్రబాబు నాయుడు కి, నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు.. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే ప్రథమ లక్ష్యంగా..నాయకులకు, కార్యకర్తలకు మధ్య వారధిలా ఉంటూ పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటు..సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో పొందిన అనుభవాన్ని జోడించి, రొండు జిల్లాల్లో పార్టీ పటిష్టతకు అహర్నిశలు శ్రమిస్తాననీ తెలియజేశారు..

## నారా లోకేష్ ఇంటి వరకు జరుగు పాదయాత్రను జయప్రదం చేయండి



**కర్నూలు సిటీ, మే 12, ప్రభాతవార్త :** సమగ్ర శిక్ష పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మే 15వ తేదీన విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుండి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇంటి వరకు జరుగు పాదయాత్రను జయప్రదం చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ జేఏసీ నాయకులు కోరారు కార్యక్రమానికి సంబంధించిన డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని ప్రాజెక్ట్ ఆఫీసర్ నూకరాజు గారికి అందజేశారు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.డి. అంజిబాబు జేఏసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రాజు జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ మధుబాబు కేజీబీవీ నాయకులు రేణుక,నాగరాజు, మాధవస్వామి తదితరులు కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష మరియు కేజీబీవీ లలో పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డి. ఎ., హెచ్. ఆర్.ఎ అమలు చేయాలని కోరారు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు విధానం లోకి మార్చాలని డిమాండ్ చేశారు గ్రాట్యుటి,ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. మెడికల్ లీవులు మంజూరు చేయాలని ఎక్స్‌గ్రేషియా 20 లక్షల రూపాయల వరకు పెంచాలని కారుణ్య నియామకాలు చేపట్టాలని మహిళలకు చైల్డ్ కేర్ లివులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు డిమాండ్ల సాధన కోసం జరుగు పాదయాత్రలో సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న ఉద్యోగులు కేజీబీవీ లలో పనిచేస్తున్న ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను జయప్రదం చేయాలని వారు కోరారు.

## మంత్రాలయంలో వైభవంగా హనుమాన్ జయంతి



**మంత్రాలయం టౌన్, మే 12, ప్రభాతవార్త:** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంత్రాలయం మండల కేంద్రంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయాలన్నీ భక్తుల నామస్మరణతో మారుమోగాయి. ఉదయం నుండే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. పాత ఊరులోని ఆంజనేయ స్వామి గుడి, రాఘవేంద్రపురంలోని ఆలయం మరియు కొండాపురం ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ముఖ్యంగా స్వామివారిని ఆకుపూజతో కనువిందుగా అలంకరించారు. పాత ఊరులోని ఆంజనేయ స్వామి ఆలయం నుండి కొండాపురం ఆలయం వరకు నిర్వహించిన కలశాల ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య భక్తులు కలశాలతో పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. పూజా కార్యక్రమాల అనంతరం ఆయా దేవాలయాల వద్ద భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. కొండాపురం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర సంఘం సభ్యులు శాంతయ్య, హండే హనుమంతు, బొంబాయి శివ, పవన్ కుమార్ మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహన



**కౌతాళం, మే 12, ప్రభాతవార్త:** కౌతాళం మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం, హోమం, ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించారు. ఆలయానికి భక్తులు దర్శించుకున్నారు. అలాగే అగసలదిన్నె, బాపురం, గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో కూడా హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం స్వామివారికి పల్లకి ఉత్సవం నిర్వహించి భక్తి కీర్తనలు పాడుతూ భజనలు చేస్తూ గ్రామ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భజన మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మొలగవల్లిలో నేడు సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ తల్లి సంస్మరణ కార్యక్రమం..

**ఆలూరు, మే 12, ప్రభాతవార్త:** ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, భూపేష్ తల్లి సంస్మరణ కార్యక్రమం నేడు బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. కుటుంబ సభ్యులు తమ తల్లికి ఘన నివాళులర్పించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సంస్మరణ కార్యక్రమానికి వివిధ రాజకీయ, సామాజిక, ప్రజాసంఘాల ప్రముఖులు హాజరుకానుండగా, పలువురు నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ నివాళులర్పించనున్నారు. సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమె స్మృతులను స్మరించుకోనున్నారు. గ్రామంలో ఈ కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టగా, గ్రామస్తులు కూడా పెద్దఎత్తున హాజరై కుటుంబ సభ్యులకు మద్దతు తెలపనున్నారు. తల్లి సేవలను, ఆమె కుటుంబానికి అందించిన విలువలను గుర్తు చేసుకుంటూ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో కొనసాగనుంది. కుటుంబ సభ్యులు ఆమె ఆశయాలను స్మరించుకుంటూ, ఆమె చూపిన మార్గంలో ముందుకు సాగాలని సంకల్పించనున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కర్నూలు అర్బన్, మే 12, ప్రభాతవార్త :** కర్నూలు నగరంలోని బంగారుపేట సర్కిల్ పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, 1205 2025 ఉదయం సుమారు 8:45 గంటల సమయంలో ఒక వ్యక్తి మృతిచెందినట్లు సమాచారం అందడంతో కర్నూలు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. అనంతరం కర్నూలు మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రి ఏసీ గదిలో భద్రపరిచారు. మృతుడి గుర్తింపుకు సంబంధించి తెల్లని టీ షర్ట్, నశము రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు వెంటనే కర్నూలు II టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్ఐలను సంప్రదించాలని పోలీసులు కోరారు. సమాచారం అందించేందుకు 9121101060, 9000035389 నంబర్లకు ఫోన్ చేయవచ్చని ఎస్ఐ ఎల్. శివాంజల్ తెలిపారు.

## రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు



**మహానంది, మే 12, ప్రభాతవార్త:** ప్రభుత్వం రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మరియు చిన్న సన్నకారు రైతులు మహిళలకు యూనిట్ ధరలో 50శాతం సబ్సిడి చొప్పున రాయితీపై యంత్ర పరికరాలు ప్రభుత్వం అందిస్తుంద న్నారు. ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు, కోత నూర్పిడి యంత్రాలు, వరి గడ్డి చుట్టే యంత్రాలు తదితర వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. కావాల్సిన వారు ఈనెల 19 లోపల రైతుసేవా కేంద్రాల్లో అన్‌లైన్ ధరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.

## అంగరంగవైభవంగా హనుమత్ జయంతి వేడుకలు



**రుద్రవరం, మే 12, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన రుద్రవరం మరియు మండలంలోని పలు గ్రామాల్లో హనుమత్ జయంతి వేడుకలు అంగరంవైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని రుద్రవరం పడమటి వీధిలో కొలువైన శ్రీప్రతాప రుద్ర ఆంజనేయస్వామి ప్రత్యేకపూజలందుకున్నారు. ప్రతాపరుద్ర ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ట మొదటి వార్షికోత్సవ వేడుకలు కూడ ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి అభిషేకాలు, ఆకుపూజ, సహస్రనామార్చన, విశేషపూలంకరణ, మహామంగళహారతి, తీర్థప్రసాదాలు మొదలగు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆంజనేయస్వామిని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో భక్తులకు కనువిందుగా కోలాట కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమత్ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తాదులందరికి ఆలయ నిర్వాహకులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతి సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని వివేష అలంకరణలో దర్శించుకుని పుణితులయ్యారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థి మృతి



**మంత్రాలయం, మే 12, ప్రభాతవార్త;** మండలంలోని మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ విద్యార్థి మంగళవారం మృతిచెందాడు. మాధవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన వడ్ల వెంకటేష్ ఆచారి కుమారుడు వడ్ల విజయ ఆచారి తిమ్మాపురం రోడ్డులో ఉన్న తాయమ్మవ్వ దేవాలయం ప్రారంభోత్సవానికి వెళ్లాడు. అనంతరం దగ్గరలో ఉన్న బావి వద్దకు వెళ్లాడు. అయితే బావి వద్ద కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ కుమారుడు మృతి చెందిన విషయం తెలుసుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మాధవరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి వెంకటేష్ ఆచారి రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

## యాగంటి ఆలయ సమీపంలో ఆటో బోల్తా.. : మహిళ దుర్మరణం..

(మొదటి పేజీ తరువాయి ) **: బనగానపల్లె, మే 12, ప్రభాతవార్త:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. ఆలయం సమీపంలోని సదానంద ఆశ్రమం వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఓ మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా పొదిలి మండలం కంబాలపాడు గ్రామానికి చెందిన కొంతమంది భక్తులు యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని ఆటోలో బనగానపల్లె వైపు బయలుదేరారు. ఈ క్రమంలో సదానంద ఆశ్రమం సమీపంలోని ప్రమాదకర మలుపు వద్ద ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జ్ఞానేశ్వరమ్మ (58) అనే మహిళపై ఆటో పడటంతో ఆమె తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ఆమె పక్కన కూర్చున్న మరో ఇద్దరు మహిళలు, ఆటో డ్రైవర్ గాయపడగా స్థానికులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.

# అనుమతుల్లేకుండా ఇసుక తరలింపు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**– కలెక్టర్ చర్యలపై హర్షం..**

**కోడుమూరు, మే 12, ప్రభాతవార్త ః** గత వారం రోజుల నుంచి ప్రభుత్వ అనుమతుల్లేకుండా ఉచిత ఇసుక పేరుతో అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోడుమూరు సి.పి.ఐ మండల కార్యదర్శి హమాలి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ బృందంతో మంగళవారం అక్రమ ఇసుక రవాణా చేసిన కోడుమూరు హంద్రీ నదీ తీర ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవ నధులల్లో మాత్రమే ఇసుక రీచులకు అనుమతుల్లు ఇస్తోందని, అయితే ఇక్కడున్న హంద్రీ నదీ ప్రాంతం జీవ నది కాదని, అందుకే ప్రభుత్వం ఇక్కడ ఇసుక రీచుకు అనుమతులు ఇవ్వలేదన్నారు. అయితే ఉచిత ఇసుక రీచు పేరుతో భారీగా రవాణా చేసుకొని సొమ్ముచేసుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. వీటి వల్ల ఈ ప్రాంతంలోని రైతాంగంకు,ప్రజల దాహార్తికి తీవ్ర ఇబ్బందులు కల్గించే ప్రయత్నాలు చేశారన్నారు. ఈ అక్రమ ఇసుక రవాణాపై రైతుల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడం హర్షించతగ్గ విషయమన్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హంద్రీ నదీ తీర ప్రాంతాన్ని పరిశీలించిన వారిలో సిపిఐ నాయకులు సిపిఐ నాయకులు మస్తాన్, వెంకటేష్, నాగన్న, మహిళా నాయకురాలు సులోచనమ్మలు ఉన్నారు.



## గ్యాస్ బుక్ చేసుకున్న 48 గంటల్లో సిలిండర్ అందిస్తాం

**వెలుగోడు, మే 12, ప్రభాతవార్త :** వెలుగోడు శ్రీలత గ్యాస్ డిస్ట్రిభ్యూటర్స్ పరిధిలోని వెలుగోడు, బండిఆత్మకూరు, గడివేముల మండలాలలో గ్యాస్ వినియోగదారులు గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న 24 గంటలలోపు తమ ఇండ్ల వద్ద గ్యాస్ డెలివరీ ఇస్తామని గ్యాస్ కొరత లేదని ఎజెన్సీ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 24 గంటల్లోపు సిలిండర్ ఖాళీ అయ్యే అవకాశం ఉన్న వినియోగదారులు మాత్రమే గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలని తెలిపారు. వినియోగదారులు తమ ఇంటి రిజిష్టర్డ్ చిరునామాలో సిలిండర్ డెలివరీ తీసుకునే సమయంలో మాత్రమే డెలివరీ బాయ్ కి ఓటిపి చెప్పాలన్నారు. హోటళ్ళలో సబ్సిడి గృహాల వినియోగ గ్యాస్ సిలిండర్ల ధుర్వినియోగాన్నినివారించడానికి డెలివరీ బాయ్ బుక్‌లో తేదీ మరియు సిలిండర్ నంబరు నమోదు చేసేలా వినియోగదారులు చూసుకోవాలని తెలిపారు. వినియోగదారులు గ్యాస్‌ను గృహ అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, ఏ విధమైనా అమ్మకం లేదా హోటళ్లకు ఇవ్వడం జరిగినా వారి కనెక్షన్ రద్దు చేయబడుతుందని ఎజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నారు. వినియోగదారులు ఈకేవైసీ చేసుకోవాలని తెలిపారు.

## రైతు విశిష్ట నమోదు సంఖ్య తప్పనిసరి



**వెలుగోడు, మే 12, ప్రభాతవార్త :** మండలంలోని ప్రతి రైతు విశిష్ట నమోదు సంఖ్య (ఎపిఎఫ్ఆర్) తప్పనిసరిగా చేయించుకోవాలని మండలవ్యవసాయశాఖ అధి కారి శ్వేత తెలిపారు. ఫర్టిలైజర్ డిస్ట్రీభ్యూషన్ కూడా ఈ నమోదు సంఖ్యకు జత చేయడం జరుగుతుందని, కావున భూమి ఉన్న ప్రతి రైతు ఈ యొక్క రైతు విశిష్ట నమోదు సంఖ్యను ఆయా ఆర్ఎస్ కి సిబ్బందిని సంప్రదించాలని ఆమె తెలిపారు.

## నీట్ పరీక్షల నిర్వహణలో వైఫల్యం.. విద్యార్థుల జీవితాలతో చెలగాటం

**నంద్యాల హాస్పటల్, మే 12, ప్రభాతవార్త :** నీట్ పేపర్ లీక్ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపిస్తోందని, పేపర్ లీక్ అవడానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్.ఎఫ్.ఐ.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.నాయక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భారతదేశంలో వైద్య విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు ఎదురు చూసే పరీక్ష నీట్ అని వైద్య విద్యలో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ విద్యలో సమాన అవకాశాలు కల్పిస్తుందని అప్పట్లో ప్రచారం చేశారని కానీ వాస్తవ పరిస్థితులు చూస్తే ఈ పరీక్ష విద్యార్థుల ప్రతిభను కొలిచే పారదర్శక వ్యవస్థగా కాకుండా నిర్లక్ష్యం..అవినీతి..పేపర్ లీకులు.. కోచింగ మాఫియాల దోపిడి వేదికగా మారిందని ఆయన విమర్శించారు. 2026 మే 3న నిర్వహించిన నీట్ పరీక్షకు దేశ వ్యాప్తంగా సుమారు 22.05 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారని551 నగరాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని, ఇంత భారీ స్థాయిలో పరీక్ష నిర్వహించడం చిన్న విషయం కాదన్నారు. కానీ ఇంతటి కీలకమైన పరీక్ష నిర్వహణలోను పారదర్శకత, భద్రత,సమన్వయం లేక పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు.

## అత్యంత భక్తిశ్రద్దలతో హనుమాన్ జయంతి వేడుకలు



**నందికొట్కూరు, మే 12, ప్రభాతవార్త :** పట్టణంలోని కోట వీధిలో వెలసిన శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. హిందూ సాంప్రదాయాంలో అత్యంత పవిత్రమైన పండుగ. శివమహాపురాణం, రామాయణ ప్రకారంవానర రాజైన కేసరి, అంజాదేవిలకు వాయుదేవుని అనుగ్రహంతో వైశాఖ శుద్ధ దశమి చైత్ర పౌర్ణమి నాడు హనుమంతుడు జన్మించాడని పురాణాలు చెబుతున్నా యని, భక్తి శక్తి జ్ఞానాలకు ప్రతీకంగా హనుమంతుని జన్మదినాన్ని జరుపుకుంటున్నామని పురోహితులు తెలిపారు.ఉదయం నుండే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అలాగే పట్టణంలోని అన్ని శ్రీఆంజనేయస్వామి దేవాలయాలలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వ హించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తుల కొరకు అన్ని ఏర్పాట్లు చేశారు.

## కాలం బంగారు కన్నా విలువైనది




**పగిడ్యాల, మే 12, ప్రభాతవార్త :** కాలం బంగారు కన్నా విలువైనదనీ గ్రంథాలయ అధికారిణి కె.మద్ధమ్మ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి ఆధ్వర్యం లో మంగళవారం వేసవి విజ్ఞాన శిభిరము నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి మద్ధమ్మ మాట్లాడుతూ కాలం బంగారు కన్నా విలువైనదికావున విద్యార్థులు సమయం వృధాచేయరాదనీ, గడిచిపోయిన కాలం తిరిగిరాదన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథా లయం వచ్చి పుస్తకపఠనం చేసి విజ్ఞానాన్ని సముపార్జించుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించా లన్నారు. జాతకపథలలో " తనకుతానే సాక్షి " అనే కథను విద్యార్థుల చేత చదివించి దాని భావము వివరించారు. గ్రంథాలయ అధికారిణి కె.మద్ధమ్మ విద్యార్థులకు చాక్‌లెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వార్థ జీవితం పుస్తకావిష్కరణ




**ఆదోనిలీగల్, మే 12, ప్రభాతవార్త;** ప్రముఖ రచయిత సవ్వప్పగారి ఈరన్న రాసిన స్వార్థ జీవితం పుస్తకావిష్కరణ సభ స్థానిక శ్రీ కృష్ణదేవరాయ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. విశ్రాంత తహసీల్దార్ షేక్షావలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత ఈరన్న మాట్లడుతూ ప్రస్తుత సమాజంలోని ప్రతి విషయంలోనూ స్వార్థం అనేది విలయతాండవం చేస్తుందని, ఈ స్వార ం వల్ల వ్యక్తి తన ఉనికిని సైతం కోల్పోతున్నాడని పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ హైస్కూల్ కరస్పాండెంట్ ఉసేనప్ప పుస్తకాన్ని ఆవిష్కరించగా, కన్నడ ఉపాధ్యాయుడు ఓంకార్ పుస్తకాన్ని సమీక్ష చేశారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ సక్కిరి భాస్కర్, అరుణ దంపతులకు అంకితమిచ్చారు. భాస్కర్ మాట్లాడుతూ సవ్వప్ప గారి ఈరన్న 77 సంవత్సరాల వయస్సులో 77వ పుస్తకం రాయడం సామాన్య విషయం కాదని, ఈయన వృద్ధ రచయిత అయినా హృద్య రచయిత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నైస్ అకాడమీ డైరెక్టర్ నరసప్ప, రంగస్థల కళాకారులు రంగన్న, వలమన్న పాల్గొన్నారు.

## కోనేరులో జారిపడి వ్యక్తి మృతి



**బనగానపల్లె, మే 12, ప్రభాతవార్త:** మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న కోనేరులో మంగళవారం ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మృతుడు కడప పట్టణానికి చెందిన బోయ బాల నరసింహులు (43)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదవశాత్తు కోనేరులో జారి పడటంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కిశోర బాలికలు భవిష్యత్‌పై అవగాహన కలిగి ఉండాలి

**– ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చందన**




**దేవనకొండ, మే 12, ప్రభాతవార్త;** కిశోర బాలికలు భవిష్యత్‌పై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చందన పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో కిశోర బాలికలకు గ్రామం, పాఠశాల, సమాజంలో పిల్లలు ఎదుర్కొనే వ్యక్తిగత, సమూహ అవసరాలు ఎలా అర్థం చేసుకోవాలన్న విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యం, భద్రత, విద్య, భవిష్యత్‌కు చాలా ముఖ్యమని, అలాగే ప్రతి బాలికకు తన అవసరాలు, భావాలు, అభిప్రాయాలు ముఖ్యమని, వాటిని గుర్తించడం, వ్యక్తపరచడం ఆమె హక్కు అని తెలియజేశారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది నాగేశ్వరరావు, వన్ స్టాప్ సెంటర్ సీఏ హసీనబేగం, కేస్ వర్కర్ శివమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవన నైపుణ్యాలను బాలబాలికలు అలవర్చుకోవాలి: సిడీపివో..



**సాతనూరు(కోసిగి), మే 12, ప్రభాతవార్త :** జీవన నైపుణ్యాలను, స్వీయ అవగాహన ద్వారా ప్రతి బాలబాలికలు తప్పని సరిగా అలవర్చుకోవాలని డిసిపివో శారద, సీడీపివో రాజేశ్వరీలు అన్నారు..కిశోర వికాసం వేసవి సెలవుల శిక్షణలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా జీవన నైపుణ్యాలు అనే అంశంపై అవగాహన కల్పించారు.. వారు మాట్లాడుతూ స్వీయ అవగాహన ద్వారా, జీవన నైపుణాల ద్వారా జీవన వికాసం ఏర్పడుతుందన్నారు.. ముఖ్యంగా కిశోర బాలబాలికల్లో ఈ పద్దతి ద్వారా వ్యక్తిత్వం, మంచి లక్షణాలు సరైన సమయంలో నిర్ణయాలు, వ్యక్తుల పట్ల గౌరవం, సమాజం పట్ల ఏ విదంగా మెలగాలి అనే అంశాలన్ని బలపడుతాయని తెలిపారు..బాలికలు తమ జీవితాన్ని ఉన్నతమైన స్థాయికి ఎదగడానికి ఈ జీవన నైపుణ్యాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు..అనంతరం బాల్య వివాహాలపై సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మిబాయి, కాత్యాయినీ ఆధ్వర్యంలో స్కిట్(చిరునాటిక) చేయించారు..అంతేకాక ఆటపాటల ద్వారా నృత్యం చేస్తూ అందరికి వివరించారు.. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**ఆదోనిలీగల్, మే 12, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. 16 రోజుల సుందరకాండ పారాయణం పూర్తి చేసినట్లు భక్తులు తలెఇపారు. హనుమాన్ చాలీసా 41 సార్లు సామూహికంగా భక్తులచే పారాయణం చేయడం జరిగిందని, ఆంజనేయస్వామి వారికి పంచామృతాభిషేకంతో పాటు తమలపాకులు, వడలు, సింధూరం, పుష్పాలతో అష్టోత్తర పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వి.త్రివేణి, సెక్రటరీ బి.సంగీత, కోశాధికారి పి.హిమబిందు, మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నాణ్యమైన జొన్నలనే కొనుగోలు చేయాలి



**పాములపాడు, మే 12, ప్రభాతవార్తః** నాణ్యమైన జొన్నలనే కొనుగోలు చేయాలని సివిల్ సప్లయి డిఎం అశ్వర్థ నారాయణ నాయక్ అన్నారు. మంగళవారం పాములపాడు వ్యవసాయ కార్యాలయం నందు పాములపాడు, మిట్టకందాల, వేంపెంట గ్రామాల డిఆర్‌డిఏ సిబ్బంది, రైతుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన డిఆర్డీఏ సిబ్బందికి తెలియజేస్తు నాణ్యమైన జొన్నలుంటేనే కొనుగోలు చేయాలని సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్‌రెడ్డి, ఏపీఎం ఉమా మహేశ్వరీ, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**కొలిమిగుండ్ల, మే 12, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల పరిధిలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో మంగళవారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి జయంతి సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మీర్జాపురం, బందార్లపల్లె చెక్‌పోస్టు, ఉమ్మాయిపల్లి గుండం ఆంజేయస్వామి దేవాలయం వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బందార్లపల్లె చెక్‌పోస్టు నుండి మోటార్ సైకిళ్ళ అంకిరెడ్డిపల్లి, కనకాద్రిపల్లె, ఇటిక్యాల, కొలిమిగుండ్ల మీదుగా మీర్జాపురం బాట ఆంజనేయస్వామి వరకు జై హనుమాన్ అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో శ్రీను, వైవిఎస్ నారాయణరెడ్డి, పోతిరెడ్డి రఘునాధరెడ్డి, తదితర హిందువులంతా ఈసందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు.



## బీజేపీ హాలహర్వి మండలాధ్యక్షుడిగా వడ్డే సురేష్ నియామకం

**– ప్రధాని మోదీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్తా.. – మండలాధ్యక్షుడు సురేష్..**



**హాలహర్వి, మే 12, ప్రభాతవార్త;** బీజేపీ హాలహర్వి మండల నూతన అధ్యక్షుడిగా నిట్రవట్టి గ్రామానికి చెందిన వడ్డే సురేష్ నియమితులయ్యారు. కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు జిల్లా కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా మండలకేంద్రమైన హాలహర్విలో పార్టీ శ్రేణులు సురేష్‌కు ఘన స్వాగతం పలికారు.

**– ప్రజా సమస్యలపై పోరాడతా :** ఈ సందర్భంగా నూతన మండలాధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను మండలంలోని ప్రతి ఇంటికీ తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. హాలహర్వి మండలంలో నెలకొన్న తాగునీరు, రోడ్లు, ఇతర ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సురేష్ నియామకం పట్ల నిట్రవట్టి గ్రామస్తులు, మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నియామక కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**నంద్యాల మున్సుపాల్టి, మే 12, ప్రభాతవార్త :** నంద్యాల పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలు స్థానికి పివినగరు వద్ద ఉన్న అంజనేయ స్వామి దేవస్థానములో ఘనంగా నిర్వహించారు అనంతరముబారీ ర్యాలీ చేపట్టారు.ఈర్యాలీ స్థానిక నాయకులు పార్టిలకుఅ తీతంగా పాల్గొనినఅంజనేయ స్వామి కృపకు పాత్రులు అయ్యారు. అందులో బాగంగా జిల్లా బిజేపి అద్యక్షలు అబిరుచి మధు ర్యాలీలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. జిల్లా యస్‌స్ సునీల్ షేరాన్ నేతృత్వంలో ర్యాలీకి బారీ బందో బస్తును ఏర్పాటు చేశారు.

## ఘనంగా నర్సుదినోత్సవవేడుకలు

**నంద్యాల హస్పటల్, మే 12, ప్రభాతవార్త :** అరనంతర్‌జాతీయ నర్సుడే పందర్భముగా నంద్యాలోని ప్రభుత్వ అసుపత్రి మరియు ప్రవేటు అసుపత్రుల్లో నర్సేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్బముగా నిర్వహించిన సమావేషాల్లో వైద్యాదికారులు మాట్లాడుతు రోగుల సంరక్షణలో నర్సులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నగలు రాత్రి తేదా లేకుండా సేవలందిస్తు సమాజ అరోగ్య రక్షణకు నర్సులు అంకితబావముతో పని చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికి తినిపించారు. ఉత్తమ సేవలు అందించిన పలువురు నర్సులకు సన్మానము చేశారు.

## ఘనంగా లక్ష్మీ చెన్నకేశవ ఆంజనేయస్వామి రథోత్సవం...



**దేవనకొండ, మే 12, ప్రభాతవార్త;** మండలంలోని పొట్లపాడు గ్రామంలో 17వ శ్రీశ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆంజనేయస్వామి వారి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచాయి. గ్రామ ప్రజలు, భక్తులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, స్వామివారికి అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వెలుగు రథం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో వేడుకలు జరిగాయని కార్యనిర్వాహకులు గుడి ధర్మకర్త హనుమంతునాయుడు, డీసీసీ అద్యక్షులు అడ్వకేట్ క్రాంతినాయుడు బోయ, డాక్టర్ విక్రమ్ నాయుడు తెలిపారు. ఈ మహోత్సవం ద్వారా సమాజంలో ఐక్యత, భక్తిభావం మరింత బలపడాలని కోరినట్లు కార్యక్రమ కార్యదర్శులు తిమ్మారెడ్డి, బడేసాహెబ్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**మహానంది, మే 12, ప్రభాతవార్తః** మహానంది పుణ్యక్షేత్రంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరెడ్డి అదేశాల మేరకు మంగళవారం ఉదయం వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతు శర్మ, ముఖ్య అర్చకులు ప్రకాశం శర్మ వేదమంత్రోచ్చరణల మధ్య ఏఈవో మధు ఆంజనేయస్వామికి వడమాలవేసి సింధూర అలంకారంతో నాగవల్లి దళపూజ, నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. అనంతరం భక్తులకు వడపప్పు, పానకం పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, పూజారులు ధర్మతేజ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు సంగమేశ్వరం ప్రధాన రహదారికి మరమ్మత్తులు చేయాలి



**కొత్తపల్లి, మే 12, ప్రభాతవార్తః** ఆత ్మకూరు నుండి కొత్తపల్లి మీదుగా సంగమేశ్వరం వెళ్లె ప్రధాన రహదారికి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అల్ ఇండియా సూ ్టండెట్ ్స అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో కొత్తపల్లి మండల డిప్యూటి తహశీల్దార్ అరుణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ ఆత్మకూరు నుండి కొత్తపల్లి మీదుగా సంగమేశ్వరం వెళ్లె ప్రధానరహదారి దెబ్బతిని ప్రమాదకరంగా మారిందని రహదారి అధ్వాన్నంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన సంగమేశ్వరం, కొలనుభారతి ప్రాంతాలను ప్రతిరోజు పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుంటారని రహదారి భక్తులకు తీవ్ర అసౌకర్యంగా ఉందన్నారు. భారీ గుంతల్లో వర్షపునీరు నిలిచి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయన్నారు. వెంటనే మరమ్మత్తులు చేపట్టి సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఏ నాయకులు వర్ధన్, సునీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

**పాములపాడు, మే 12, ప్రభాతవార్తః** వేంపెంట గ్రామానికి మురహరి పెద్ద పుల్లయ్య (66) రోడ్డు ప్రమాదానికి గురై చికిత్సపొందుతూ కోలుకోలేక మృతిచెందారు. పాములపాడు ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాల మేరకు ఈనెల 10న వేంపెంట గ్రామం నుండి జూపాడుబంగ్లా మండలం పి లింగాపురానికి స్కూటర్‌పై వెళ్తు పాములపాడు మండల పరిధిలోని జూటూరు గ్రామ అంచవద్ద ట్రాలీ ఆటో ఢీకొనడంతో గాయపడగా చికిత్సపొందుతూ మృతిచెందారు. ఈఘటనపై మురహరి సుశీలమ్మ ఫిర్యాదుమేరకు ఆటో డ్రైవర్ హరికృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా.. ముందుకు



: కర్నూలులో టీడీపీ జిల్లా కార్యాలయంలో సమావేశం

**కర్నూలు హాస్పిటల్ మే 12 ప్రభాతవార్త :**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 23 నెలల్లో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడునాయకత్వంలో సంక్షేమం -అభివృద్ధి అనే ద్విచక్ర సూత్రంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని తెలిపారు. ఈ మేరకు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ తదితరులు మాట్లాడారు. జగన్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని, అలాంటి పరిస్థితుల్లో ప్రజలు విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబు నాయుడిని విశ్వసించి కూటమికి భారీ మెజారిటీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. పెన్షన్ల పెంపు, రైతులకు మద్దతు, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వం ముందడుగు వేస్తోందని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉత్తమ ఫలితాలు సాధించాయని నాయకులు తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాల అంటే నాణ్యమైన విద్య" అనే స్థాయికి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు కొరకంచ రవికుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు కె.వి.సుబ్బారెడ్డి, నంది మధు, సత్రం రామకృష్ణుడు, రవిచంద్ర శర్మ, మందా అఖిల్, షేక్షా తదితరులు పాల్గొన్నారు.

# పార్టి బలోపేతమే.. అంతిమ లక్ష్యం



**నంద్యాల, మే 12,ప్రభాతవార్తప్రతినిధి**
నంద్యాల జిల్లా బారతీయ జనతాపార్టి బలోపేతమే తన అంతిమ లక్ష్యమని జిల్లా బిజేపి అద్యక్షులు అబిరుచిమధు అన్నారు. మంగళవారము నంద్యాల పట్టణంలోని జిల్లా బిజేపి పార్టి కార్యాలయంలో జిల్లా అద్యక్షులు అబిరుచి మధు అద్యక్షతన పార్టి కోర్ కమిటి సమీక్ష సమావేషము నిర్వహించారు. ఈసందర్బముగా గతనెలలో జరిగిన పార్టి కార్యక్రమాలు జెండా అవిస్కరణలు జిల్లా కమిటి నియమాపకాలు జిల్లాలో జరుగవలసిన ప్రతి శిక్షణ గురించి జిల్లా కార్యవర్గ సభ్యులు నియమాపము మండల ఇంచారిన.ల నియమాపకము అనేక అంశాలపై చర్చించడము జరిగింది.సమావేషములో కోరఖ కమిటి సభ్యులు జిల్లా అద్యక్షలు అబిరుచి మధు జిల్లా ప్రదాన కార్యదర్శులు శివకృష్ణ కాశెట్టి చంద్రశేఖరు. కిరణ్ సీనిరయ్ నాయకులు ఖదారుబాదుబ్రహ్మంజీ మేడమురళీదర్ కశెట్టి కృష్ణమూర్తి బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి , బిజ్జిగాళ్ల లింగన్న శబనా, ఇంటి అదినారాయణలు పాల్గొన్నారు. ఈసందర్బముగా జిల్లా అద్యక్షలు మాట్లాడుతూ జిల్లా బిజేపి పార్టి నానాటికి బలోపేతము అవుతున్నదని దీనిని మరింత బలోపేతము చేయడమే తన ప్రదాన కర్తవ్యమని చెప్పారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నిలో సత్తా చాటాలని అలాగే రాబోవో 2029 సాదారణ ఎన్నికలకు పార్టి ఇక్కడ తిరుగు లేని శక్తిగా ఎదిగే విదముగా వ్యూహరచణ చేస్తున్నామని దానికి ప్రతి బిజేపి కార్యకర్త తన వంతు సహకారము అందించాలని కోరారు,.

# శ్రీబాల ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**మిడుతూరు,మే 12,ప్రభాతవార్త:**



మండల పరిధిలోని చెరుకుచెర్ల బాట సమీపంలో వెలసిన శ్రీబాల ఆంజనేయస్వామి ఆలయంలో హానుమాన్ జయంతి పురస్కారించుకొని నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తుల తాగు నీటి కొరకు వేసిన బోరు బావికి పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్లు కాతా రమేష్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసి ఉపాధ్యాక్షుడు సుధాకర్‌యాదవ్, ఆలయ నిర్మాణ కర్త బజారి యాదవ్, స్తానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



**ఎమ్మిగనూరు టౌన్,మే 12,ప్రభాతవార్త:**
శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలోని అబ్బాస్ టాకీస్ సమీపంలోని సోగనూరు రోడ్డులో ఉన్న శ్రీశ్రీశ్రీ వజ్ర అభయ నవ రూప ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. శ్రీ హనుమంతుని కృపతో ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, మార్కెట్ యార్డు చైర్మన్, పట్టణ మరియు మండల కమిటీ సభ్యులు, వార్డు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# మాజీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడుని పరామర్శించిన కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె, మే 12 ప్రభాతవార్త:**
మండలంలోని జిల్లెళ్ల గ్రామానికి చెందిన మాజీ నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ రైతు విభాగం అధ్యక్షుడు మంగవరపు శివరామిరెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అవుకు మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి లు మంగళవారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు జిల్లెళ్ల శంకర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నైతిక బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలి..!

: కొడుకు పోక్సో కేసు పై నైతిక బాధ్యత వహించి కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణం రాజీనామా చేయాలి!




**కర్నూలు మే 12 ప్రభాతవార్త ప్రతినిధి :**
కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ పై 17 ఏళ్ల మైనర్ బాలికను మద్యం తాగించి, లైంగికంగా వేధించిన ఘోర ఆరోపణలతో పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం పై పట్ల తండ్రిగా కేంద్ర మంత్రి బండి సంజయ్ నైతిక బాధ్యత వహించి , తక్షణం రాజీనామా చేయాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి లు డిమాండ్ చేశారు. .. మైనర్ బాలికపై అత్యాచార చేసిన బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కర్నూల్ కలెక్టర్ కార్యాలయం నందు ధర్నా నిర్వహించారు ఒకవైపు బాలికల రక్షణ కోసం మేమున్నామంటూ “బేటీ బచావో“ అని ఊదరగొట్టే బీజేపీ నాయకుడి సొంత ఇంటి లోని వ్యక్తే మహిళా భక్షకులుగా ఉన్నారని,చెప్పేవి శ్రీరంగ

# జలదార, జలహారతి ద్వారా పాణ్యం చెరువుకు నూతన హంగులు

: గ్రామీణాబివృద్ధి పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



**నంద్యాల, మే 12,ప్రభాతవార్తప్రతినిది :**
ంగ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ నీటి వనరుల పునరుద్దరణ కు ప్రభుత్వం ప్రత్యేక ప్రాదన్యాత ఇస్తోందని జిల్లా కలెక్టరు రాజకుమారి పాణ్యం యంయల్‌ఎ గౌరుచరిత అన్నారు. మండళవారము .జలదార జలహారతి కార్యక్రమంలో బాగంగా పాణ్యం మండలంలోని పాణ్యం చెరువు కట్టవద్ద చేపట్టనున్న అబివృద్ధి పనులనకు పాణ్యం యంయల్‌ఎ గౌరుచరితారెడ్డి తో కలిపి కలెక్టరు భూమి పూజ నిర్వహించారు. ఈసందర్బముగా కలెక్టరు జలవనరుల సంరక్షణతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకుసంప్రదాయ నీటి వనరుల పునరుద్దరణకు ప్రభుత్వం శ్రీకారము చుట్టిందన్నారు. పాన్యం చెరువు కట్ట పరిసరాలనుపర్యాటక వినోద కేంద్రముగా అబివృద్ధిచేయాలనే ల్యోంతో సుమారు రూ 48లక్షల అంచనా వ్యంలో వాకింగ్ ట్రాక్ ఓపన్ జిమ్ పార్కు బెంచీలు మరియు సోలార్‌లైట్ల ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు తెలిపారు జలదార జలహారతి కార్యక్రమం ద్వారా చెరువుల అబివృద్ధితో పాటు ప్రజలకు అరోగ్యకరమైన వాతావరణము పర్యావరణ పరరక్షణ మరియు గ్రామీణ జీవన ప్రమాణాల మెరుగుదల సాధ్యమవుతుందని కలెక్టరు పేర్కొన్నారు. పాణ్యం చెరువులో పేరుకుపోయిన పూడికను రైతులు స్వచ్ఛందమగూ తమ వ్యవసాయ భూములకు తరలించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని కలెక్టరు చెప్పారు. ఇందకు సంబందించి ఇప్పటికే ఉపాది హామీ పథకము కింద రూ 4.5లక్షల మేర సీడ్ అప్లికేషన్‌లు మంజూరయ్యాయని అవసరమైతే మరిన్ని నిదులుకూడా మంజూరు చేస్తామని కలెక్టరు చెప్పారు. జలదార పథకములో బాగంగా అమలు చేస్తున్న చైన్ అప్ ట్యాంక్స్ విదానములో పాణ్యం చెరువు 24న క్యాస్కేడ్లఓని మూడవ చెరువుగా గుర్తింపు పొందిందని తెలిపారు.ఈ వదానము ద్వారా నీటి నిల్ల సామర్థ్యం పెరగముతో పాటు భూగర్బ జలాల స్థాయి కూడా మెరుగుపడుతుందని కలెక్టరు పేర్కొన్నారు. అదేవిదముగా గ్రామాబివృద్ధి కార్యక్రమాల్లో బాంగా పశువుల సంరక్షణ కోసం రూ 10లఓల వ్యయంతో క్యాటినన హాస్టల్ నిర్మాణమునకు స్థలం గుర్తించాలని డ్వామా పిడినకలెక్టరు అదేశివంయారు. చేపల పెంపకానిక ప్రోత్సాహకముగా రూ 10లక్షల అంచనా వ్యయంలోషిష్‌షాండ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు స్థానిక హైస్కూలుచుట్టు సుమారు 1.5కిలో మేర కాంపౌండు వాల్ నిర్మాణాన్ని రెండు విడుదతల్లో పూర్తి చేస్తామని కలెక్టరు వెల్లడించారు విద్యార్థుల భద్రతతో పాటు పాఠశాల అడివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈకార్యక్రమాంలో డ్వామా పిడి సూర్యనారాయణ ప్రజాప్రతినిదులు ఉపాది హామీ సిబ్బంది అదికారులు పాల్గొన్నారు.

# డిజిటల్ డోర్ నంబర్ల ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి : కమిషనర్ గంగిరెడ్డి

**ఎమ్మిగనూరు టౌన్,మే 12, ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ డిజిటల్ డోర్ నంబర్ ప్రాజెక్టులో భాగంగా మంగళ వారం ఎమ్మిగనూరులో ప్లానింగ్, అడ్మిన్ మరియు ఎమినిటీస్ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీపీఓ రాజేష్, ఆర్ఓ అస్లాం భాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ గంగి రెడ్డి, టీపీఓ రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సాంకేతిక ప్రక్రియను పట్టణంలో ఎటువంటి లోపాలు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. క్యూఆర్ కోడ్ డిజిటల్ డోర్ నంబర్ల ద్వారా ప్రజలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. జీపీఎస్ ఆధారంగా చిరునామాలను సులభంగా గుర్తించడంతో పాటు అంబులెన్స్, ఫైర్, పోలీస్ వంటి అత్యవసర సేవలు వేగంగా చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఇంటి, నీటి పన్నుల చెల్లింపులు పారదర్శకంగా జరిగేలా సహాయపడుతుందని తెలి పారు. పోస్టల్, కొరియర్, ఆన్‌లైన్ డెలివరీలు సులభతరం కావడంతో పాటు రేషన్, పెన్షన్, సర్వేలు వంటి ప్రభుత్వ సేవలు త్వరగా అందజేయవచ్చని వివరించారు. మున్సిపల్ రికార్డులు డిజిటల్ రూపంలో అప్‌డేట్ అవుతాయని తెలిపారు.

# ప్రతి పేదోడు సొంతింటి కల నెరవేర్చడమే.. ప్రభుత్వ లక్ష్యం

: ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి.

**ఆదోని మే 12 ప్రభాతవార్త :**



కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదోడికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ దేయమని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి అన్నారు వైసిపి ఆయాంలో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పేదల సొమ్ము కొట్టేసిన వాళ్ళు పురుగులు పడిపోతారని అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ అల్ నందు వివో ఏ ఆర్పీలకు లకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఎన్టీఆర్ హౌసింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి పేదోడు సొంతింటి కల నెరవేర్చాలని ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదోని పట్టణానికి పదివేల ఇల్లు మంజూరయ్యాయి. అయితే ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలు లేకపోవడంతో దీన్ని ఆసరాగా చేసుకున్న వైసిపి మాజీ ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం నిధులతో స్థలాలను కొనుగోలు చేసి వాటికి జగనన్న కాలనీ పేరు పెట్టి ఇళ్ల నిర్మాణం చేస్తామని కేంద్ర ప్రభుత్వానికి చెప్పి కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంటి నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయుచున్నాడని అయితే ఈ స్థలాల కొనుగోలు విషయంలో ఆదోని పట్టణంలో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి 107 ఎకరాల భూమిని 65 మంది రైతులతో ఐదు లక్షల లెక్క ఒప్పందం కుదుర్చుకొని ప్రభుత్వానికి మాత్రం 13 లక్షల 50 వేల రూపాయలు ధర పలుకుతుందని చెప్పి రైతులతో ఐదుల లక్షల లెక్క ఒప్పందం కుదుర్చుకొని ఎకరాకి ఎనిమిది లక్షలు 50వేల రూపాయలు చొప్పున 15 కోట్ల రూపాయలను రైతుల సొమ్మును కొట్టేశారని అన్నారు. అదేవిధంగా 10,000 మంది పట్టాదారులకు ఇల్లు చేసేందుకు లబ్ధిదారులు చేసుకోలేరని ఒక ప్రైవేట్ కాంట్రాక్ట్ ను పిలిపించుకొని లోపపందం మాట్లాడుకుని నాసిరకం ఇల్లు నిర్మాణం చేస్తూ పేదల సొమ్ము కొట్టేసాడని ఆయన తప్పు పట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నహీమ్ హమ్మద్ హౌసింగ్ అధికారులు. ఏపీఎం ఈరన్న తదితరులు పాల్గొన్నారు

# అనుగ్రహించు.. హనుమా..!

: వైభవోపేతంగా హనుమజ్జయంతి
భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

**ఎమ్మిగనూరు క్రైం, మే 12 ప్రభాతవార్త :**



వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం హనుమద్ జయంత్యుత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ప్రవచనాలు, హనుమాన చాలీసా పఠనాలను నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఎమ్మిగనూరులో ఆంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీరామ పట్టాభిషేకాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వైభవంగా హనుమాన్ శోభాయాత్ర సాగింది. జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో ఆలయాలు మార్మోగాయి. హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీ మార్కండేయ స్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు శ్రీనివాసులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ప్రవచనాలు, హనుమాన చాలీసా పఠనాలను నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఎమ్మిగనూరు పట్టణంలోని వివిధ కాలనీలలో వెలసిన ఆంజనేయ స్వామి దేవాలయాల నందు హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆంజనేయ స్వామికి వేద పండితులు తమలపాకులతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. హనుమ నామస్మరణతో ఎమ్మిగనూరు మారుమోగింది. వేడుకల సందర్భంగా ఆలయాలను రంగురంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందచేసి ఆశీర్వదించారు.
హనుమాన్ జయంతికి భారీ భద్రత..! "జై బోలో హనుమాన్‌కి, జైశ్రీ రామ్ అంటూ భక్తుల ఆధ్యాత్మిక నినాదాలు, యువత ఉత్సాహంతో మంగళవారం నిర్వహించే హనుమాన్ జయంతికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా నిర్వహించే శోభాయాత్రలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలు చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేకంగా పికెటింగ్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఎమ్మిగనూరు మండలం పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన అధికారులు ఆయా ప్రాంతాల్లో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

# నీట్ పేపరు లీకేజీ విద్యార్థుల భవిష్యత్తుతో సర్కార్ చలగాటం

**నంద్యాల, టౌన్ మే 12,ప్రభాతవార్త**
దేశవ్యాప్తంగా దాదాపు 25లఓల మంది విద్యార్థులు తమ వైద్య విద్య కలకోసం పగులు రాత్రి కష్టపడి రాసిన నీట్ న పరిక్షా పంత్రాల లీకన కావడము అత్యతం దురుదుష్టకరమని వైసిపి పార్టి నాయకుడు సన్నాలసామిరాంరెడ్డ ఆదేవన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అసమర్థత అదికారులు నిర్లక్ష్యం కారణంగా లక్షలాది కుటుంబాల్లో ఆవేదన నొలకొంది పరీక్షకు ముందు రోజే సుమారు 100ప్రశ్నలు బయటకు వచ్చాయన్న వార్తలు వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెడుతన్నాయి. గత అనుభవాల నుంచి పాఠాలేవి 2024లోనూ నీట్ పరిక్షా పంత్రాల లీకేజిపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున దుమారము రేగింది. అప్పట్లోనే ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ రోజు విద్యార్థులు మళ్లీ రోడ్డున పడే పరిస్థితి వచ్చేదికాదు. గత తప్పిదాల నుంచి గుణపాఠం నేర్చుకకోకుండా వరుసగా విద్యార్తుల జీవతాలతో చలగాటము అడటము ఎంత వరకు సమంజసమని బాదతులు ప్రశ్నిస్తున్నారు.

# గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై కఠినంగా అమలు



**కర్నూలు హాస్పిటల్ మే 12 ప్రభాతవార్త**
కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. కామేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. స్కానింగ్ కేంద్రాల నమోదు, పునరుద్ధరణ దరఖాస్తులను సభ్యులు పరిశీలించారు. సరైన పత్రాలు సమర్పించని కొన్ని ఆస్పత్రులకు నోటీసులు జారీ చేయాలని కమిటీ నిర్ణయించింది. మిగిలిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని ఉన్నత స్థాయి కమిటీ ఆమోదం కోసం పంపించాలని తీర్మానించారు. జిల్లా వ్యాప్తంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సమావేశంలో సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, న్యాయ నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 17న కురువ విద్యార్థుల ప్రతిభా పురస్కార ప్రధానోత్సవం

: కర్నూలు జిల్లా కురువ సంఘం.



**కర్నూలు సీటీ, మే12.ప్రభాతవార్త :**
ఈనెల 17వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కర్నూలు నగర సమీపంలోని పెద్దపాడు రోడ్ లోని ఏ.పీ.మోడల్ స్కూల్ ప్రక్కన ఉన్న శ్రీ భీరలింగేశ్వర స్వామి ప్రాంగణం నందు కురువ విద్యార్థుల ప్రతిభా పురస్కార ప్రధానోత్సవం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, కోశాధికారి కే.సి.నాగన్న ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ, బి. వెంకటేశ్వర్లు, కె. టి.ఉరు కుందు కత్తి శంకర్ నగర అధ్యక్షులు తవుడు శ్రీనివాసులు తెలియ జేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదవ తరగతి ఇంటర్ మీడియేట్ పరీక్షలు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులు నిబంధనలు ప్రకారం పంపిన ప్రతి విద్యార్థిని విద్యార్థులకు కర్నూలు జిల్లా కురువ సంఘం తరపున మేమెంటో ప్రతిభా పురస్కారం అందుకోవాలని కోరారు. తల్లిదండ్రులు కురువ సంఘం నాయకులు కురువ కులస్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.సి.తిరుపాలు,వెంకటేశ్వర్లు దివాకర్,మద్దిలేటి,వీరన్న పెద్దపాడు పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ రిజిస్ట్రేషన్ కేసులో రెండేళ్ల జైలు శిక్ష

**కర్నూలు హాస్పిటల్ మే 12 ప్రభాతవార్త :**
కర్నూలు 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ప్లాటు డబుల్ రిజిస్ట్రేషన్ కేసులో కోర్టు తీర్పు వెలువడింది. ఫిర్యాదుదారు షేక్ మహమ్మద్ సలాం గారికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసిన ప్లాటును మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసి మోసం చేసినట్లు కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం ఏ 2 ఏ. రాముడు పై ఆరోపణలు రుజువుకావడంతో కర్నూలు ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.